





# కరపత్రం

SINCE 2014

శుక్రవారం జనవరి 9, 2026 | సంపుటి : 2 | సంచిక : 95 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




# ఉపాధి పథకం రద్దు దుర్మార్గ చర్య

- ◆ పేదల పొట్టకొట్టే యత్నం చేసిన మోడీ
- ◆ అధికారం ఉందని మోడీ ఇష్టారీతి నిర్ణయాలు
- ◆ ఉపాధితో పేదరిక నిర్మూలనకు అడుగులు
- ◆ పంచాయితీ ఎన్నికల మాదిరే మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం
- ◆ కార్యకర్తలకు సిఎం రేవంత్ రెడ్డి పిలుపు



**హైదరాబాద్,జనవరి8 :**
పేదలపై కక్షతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్నే మారుస్తారా అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. నిబంధనల మార్పు ముసుగులో పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కుట్ర చేస్తున్నారన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తామంటే అంగీకరించం అని అన్నారు. మెజారిటీ ఉందని చట్టసభలను వినియోగించి పేదలను అణచివేస్తామంటే కుదరదు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాల్సిన సమయమిదని అన్నారు. ఈ పథకంతో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. 2024 ఎన్నికల్లో 400 సీట్లు ఇవ్వాలని భాజపా నేతలు ప్రచారం చేశారు. అన్ని సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్నే మార్చేసేవారు. తద్వారా పేదల హక్కులను కాలరాయాలని చూశారు. కార్పొరేట్లకు దేశాన్ని అప్పగించే ప్రయత్నం చేశారు. ప్రజలను కాంగ్రెస్ అప్రమత్తం చేయడంతో భాజపా 240 సీట్ల వద్ద ఆగిపోయింది. దీంతో రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచన వాయిదా పడింది. ఓట్లను తొలగించేందుకు ఎస్ఐఆర్ తీసుకొచ్చారు. దీని వెనుక పెద్ద కుట్ర ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకం వల్ల వెట్టిచాకిరి ఆగిపోయిందని, గ్రామాల నుంచి వలసలు తగ్గాయన్నారు. అలాగే పనికితగ్గ వేతనం డిమాండ్ చేసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దేశంలో 80 శాతం మంది ఈ ఉపాధి హామీపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. పథకం పేరు మార్పు వెనుక ప్రధాని మోదీ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. ఎస్ఐఆర్ వెనుక పెద్ద కుట్ర ఉందని.. వీబీ జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్) చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు.

మిగతాది 2 లో

మున్సిపల్ ఎన్నికలతో

## కాంగ్రెస్ సన్నద్ధం

- » మరోమారు ప్రజల్లోకి వెళ్లేలా ప్రణాళికలు
- » ఉమ్మడి జిల్లాల్లో భారీ బహిరంగ సభలకు ప్లాన్
- » ఫిబ్రవరి 3 నుంచి 9 వరకు సభల నిర్వహణ
- » సభల నిర్వహణ బాధ్యత మంత్రి పొంగులేటికి అప్పగింత




**హైదరాబాద్,జనవరి8:**
రాష్ట్రవ్యాప్తంగా మూడు దశల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. మరికొన్ని రోజుల్లో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో సైతం ప్రభంజనం సృష్టించాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అలాగే ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టే లక్ష్యంతో అధికార కాంగ్రెస్ పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది. తెలంగాణలోని తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించనుంది. ఫిబ్రవరి 3 నుంచి 9వ తేదీ వరకు ఈ బహిరంగ సభలు నిర్వహించాలని తేదీలను ఖరారు చేసింది. ఈ బహిరంగ సభల సమన్వయ బాధ్యతను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అప్పగించింది. కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో మున్సిపల్ ఎన్నికలపైనా చర్చించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ పరిధిలో గెలుపు బాధ్యతలు తీసుకునేలా దిశానిర్దేశం చేశారు.



## సిపిఐ వందేళ్ల ప్రస్థానంపై ఖమ్మంలో సభలు

- » 18న ఖమ్మంలో భారీ ర్యాలీకి సన్నాహాలు
- » 19, 20, 21 తేదీల్లో జాతీయ కౌన్సిల్ సమావేశం
- » సిపిఐ జాతీయ నాయకులు హాజరు
- » సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ వెల్లడి

2 లో



## వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే తెరపైకి నదీ జలాల అంశం - బండి సంజయ్

**కరీంనగర్:**
కృష్ణా జలాల అంశంలో ప్రజలను కేసీఆర్ పదేపదే మోసం చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 571 టీఎంసీలు రావాల్సి ఉంటే.. 299 టీఎంసీలకే ఆయన ఎందుకు అంగీకారం తెలిపారని ప్రశ్నించారు.

వైకాపాలా రప్పా రప్పా

## విధానం మనది కాదు

- ◆ ప్రజల తీర్పునకు అనుగుణంగా సేవలు అందించాలి
- ◆ సమస్యలను పరిష్కరిస్తూనే..విమర్శలను తిప్పికొట్టాలి
- ◆ మంత్రులతో లోకేశ్ వెల్లడి


2 లో

**అమరావతి,జనవరి8 :**
వైసీపీలా రప్పారప్పా విధానం తమది కాదని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. దౌర్జన్యాలు, బెదిరించడం మన పార్టీ సంస్కృతి కాదని చెప్పారు. క్యాబినెట్ భేటీకి ముందు పలువురు మంత్రులతో ఆయన మాట్లాడారు.
ప్రజల తీర్పును గౌరవిస్తూ ఎంత సేవ చేశామన్నదే మన అజెండా కావాలి. అభివృద్ధి-సంక్షేమం సమన్వయంతో ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలి. వైకాపా కుట్రలను పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా నేతలు సమర్థంగా తిప్పికొట్టాలి. అందరూ ఏకతాటిపైకి వచ్చి అసత్య ప్రచారాలకు దీటుగా బదులివ్వాలి. ప్రజావేదికలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి మంత్రులు బాధ్యత తీసుకోవాలి. తమ శాఖలకు సంబంధించిన అర్జీల పరిష్కారానికి మంత్రులు చొరవ చూపాలి.


మిగతాది 2లో

## మహిళా మంత్రులకు కెసిఆర్ ఆత్మీయ స్వాగతం

▪ చీరసారెతో దంపతుల సత్కారం ▪ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న కెసిఆర్ ▪ మేడారం ఆహ్వాన పత్రికి అందచేసిన మంత్రులు

**గజ్వేల్,జనవరి8 :**
ఎర్రవెల్లిలోని తన నివాసానికి వచ్చిన మహిళా మంత్రులను భారత రాష్ట్రసమితి అధినేత కేసీఆర్ ఆత్మీయంగా పలకరించారు. అతిథి మర్యాదలతో పసుపు, కుంకుమ, చీర, తాంబూలాలతో సత్కరించారు.

రాయలసీమకు

## ద్రోహం చేస్తున్న చంద్రబాబు

- ▪ సీమ ఎత్తిపోతలపై దుష్ప్రచారం వెనక కుట్ర
- ▪ తెలంగాణకు దాసోహమన్న సిఎం చంద్రబాబు
- ▪ ఎపి ప్రయోజనాలు తాకట్టు పెట్టిన బాబు
- ▪ రేవంత్ రెడ్డితో బాబు రహస్య ఒప్పందం
- ▪ ఎస్ఎల్‌బిసితో 45 టీఎంసీలు తరలించేలా పనులు
- ▪ మీడియా సమావేశంలో జగన్ ఘాటు విమర్శలు


2లో

కృష్ణా జలాలపై

## పదేపదే రాజకీయాలు

- » పాలమూరు-రంగారెడ్డికి విభజన చట్టంలో ప్రతిపాదన ఏదీ
- » పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తోడితే కెసిఆర్ ఏం చేశారు
- » కెసిఆర్ 229 టిఎంసిలు చాలని సంతకం పెట్టలేదా?
- » బేసిన్లు లేవు..భేషజాలు లేవన్నదే కెసిఆర్
- » జగన్‌తో కలసి ఏం మాట్లాడారో బయటపెట్టాలి
- » ఆనాడు మేం నిలదీస్తే విమర్శలు చేశారు
- » మీడియా సమావేశంలో బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు



**కరీంనగర్,జనవరి8 :**
కృష్ణా జలాల అంశంలో ప్రజలను కేసీఆర్ పదేపదే మోసం చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 571 టీఎంసీలు రావాల్సి ఉంటే.. 299 టీఎంసీలకే ఆయన ఎందుకు అంగీకారం తెలిపారని ప్రశ్నించారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంజయ్ మాట్లాడారు. పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలించినప్పుడు ఎవరూ స్పందించ లేదన్నారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నదీ జలాల అంశాన్ని తెరపైకి తెచ్చాయని మండిపడ్డారు.. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను పూర్తిగా వాడుకోలేదు. అవసరం ఉన్నప్పటికీ వినియోగించుకోలేదు. అప్పటికే నిర్మాణంలో ఉన్నవాటికి అభ్యంతరం చెప్పొద్దని ఏపీ పునర్విభజన చట్టంలో ఉంది. ఆ చట్టంలో పాలమూరు-రంగారెడ్డికి పేరే లేదు.

మిగతాద్ది 2 లో


మిగతాది 2లో

## చైనా మాంజాపై హైదరాబాద్ పోలీసుల కీలక నిర్ణయం

**హైదరాబాద్:**


2లో..

## నిరుద్యోగులపై దమనకాండ దారుణం

- » ఆందోళన చేస్తున్న వారిపై పోలీసుల దాష్టీకం
- » జాబ్ క్యాలెండర్ పేరుతో మోసం చేసిన రేవంత్
- » ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు



## హెచ్‌టి పత్తి విత్తనాలను అడ్డుకోండి

- » రాష్ట్రంలోకి రాకుండా చర్యలు తీసుకోండి
- » టాస్క్ ఫోర్స్ టీమ్‌లతో నిఘా ఏర్పాటు
- » అధికారులకు మంత్రి తుమ్మల దిశానిర్దేశం

## వైకాపాలా రప్పా రప్పా విధానం మనది కాదు

మొదటిపేజీ తరువాయి

పార్టీ బలోపేతం, క్యాడర్‌ను ఏకతాటిపైకి తెచ్చేందుకు ఇన్‌ఛార్జ్ మంత్రులు పనిచేయాలని లోకేశ్ అన్నారు. గురువారం ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో టీడీపీ మంత్రులతో మంత్రి లోకేష్ అల్పాహార విందు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పలు కీలక సూచనలు చేశారు. జగన్‌లా ప్రజల్ని భయపెట్టడం, బెదిరించడం, దౌర్జన్యాలకు పాల్పడటం వంటివి టీడీపీ సంస్కృతి కాదని స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ ఎంత మేర సేవ చేశామన్నదే మన అజెండా కావాలని తెలిపారు. అభివృద్ధి - సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రజలకు ఎంత ప్రయోజనం చేకూర్చామన్నదే కూటమి ప్రభుత్వ విధానమని తేల్చిచెప్పారు. వైసీపీ కుట్రలను పార్లమెంట్ వారీగా నేతలు సమర్థంగా తిప్పికొట్టాలని, పార్లమెంట్ కేంద్రాల్లో నేతలు ఏకతాటిపైకి వచ్చి వైసీపీ అసత్య ప్రచారాలకు ధీటుగా బదులివ్వాలని మంత్రి సూచించారు. మంత్రులు ప్రజావేదికలో

తమకు వచ్చే ఫిర్యాదులు పరిష్కారమయ్యేలా బాధ్యత తీసుకోవాలని చెప్పారు. తమ తమ శాఖలకు సంబంధించిన అర్జీల పరిష్కారానికి మంత్రులు చొరవ చూపాలని ఆదేశించారు. పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా క్యాడర్‌ను ఏకతాటిపైకి తెచ్చేందుకు ఇన్‌ఛార్జి మంత్రులు పనిచేయాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు.

## వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే తెరపైకి నదీ జలాల అంశం

మొదటిపేజీ తరువాయి

కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంజయ్ మాట్లాడారు. పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలించినప్పుడు ఎవరూ స్పందించలేదన్నారు.

"వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నదీ జలాల అంశాన్ని తెరపైకి తెచ్చాయి. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను పూర్తిగా వాడుకోలేదు. అవసరం ఉన్నప్పటికీ వినియోగించుకోలేదు. అప్పటికే నిర్మాణంలో ఉన్నవాటికి అభ్యంతరం చెప్పొద్దని ఏపీ పునర్విభజన చట్టంలో ఉంది. ఆ చట్టంలో పాలమూరు-రంగారెడ్డికి పేరే లేదు. పోతిరెడ్డిపాడు ద్వారా 4 టీఎంసీల నీటిని ఏపీకి తరలించారు. దీన్ని గతంలో అడ్డుకోలేదు. కాంగ్రెస్, కేసీఆర్ చేసిన మోసాలు చూస్తే నాకు ఆశ్చర్యం వేసింది" అని బండి సంజయ్ అన్నారు.

## చైనా మాంజాపై హైదరాబాద్ పోలీసుల కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి

చైనా మాంజా విషయంలో నగర పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ దారాన్ని అమ్మినా.. కొనుగోలు చేసినా.. ఆ మాంజాతో పతంగులు ఎగరేసినవాళ్లపైనా కేసులు పెడతామని హెచ్చరించారు. తాజాగా భారీగా నిషేధిత మాంజాను పోలీసులు పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో కమిషనర్ సీపీ సజ్జనార్ మాట్లాడుతూ..

చైనా మాంజాపై నిషేధం విధించి పదేళ్లు అవుతోంది. ఇండస్ట్రీయల్ అవసరం కోసం తయారైన దారాన్ని మాంజాగా ఉపయోగిస్తున్నారు. వీటి వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మనుషుల ప్రాణాలు పోతున్నాయి. ఇక మీదట నగరంలో అమ్మినా.. కొన్నా.. ఆ దారంతో పతంగులు ఎగరేసినా కేసులు పెడతాం. చైనా మాంజా కారణంగా ఎవరికైనా గాయాలైనా కేసులు పెడతాం. చైనా మాంజా విషయంలో పీడీ యాక్ట్ ప్రయోగించే ఆలోచన చేస్తున్నాం అని సజ్జనార్ హెచ్చరించారు.

చైనా మాంజాపై బ్యాన్ ఉన్నప్పటికీ.. సంక్రాంతి సీజన్‌కు ఉన్న మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని దుకాణాదారులు మాత్రం ఇతర రాష్ట్రాల నుంచి తెప్పిస్తున్నారు. పతంగులు ఎగురవేసే సమయంలో అవి తెగి మాంజా గాలిలో వేలాడుతున్నాయి. వాహనాలపై ప్రయాణించేవారికి చుట్టుకొని తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే పక్షులు చనిపోతున్నాయి. తాజాగా..

నగరంలో అధికారులు పట్టుకున్న మాంజా విలువ రూ.1.2 కోట్లు ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. ఢిల్లీ, సూరత్, మహారాష్ట్ర నుంచి దుకాణాదారులు చైనా మాంజాను తెప్పించే క్రమంలో వారి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అంతేకాదు.. చైనా మాంజా తయారు చేస్తున్న రెండు ఫ్యాక్టరీలను సీజ్ చేసినట్లు.. గుజరాత్, రాజస్థాన్ తోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ మాంజా ఫ్యాక్టరీలపై పోలీసుల ఆపరేషన్ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## ఉపాధి పథకం రద్దు దుర్మార్గ చర్య

మొదటిపేజీ తరువాయి

ఉపాధి హామీని రద్దు చేస్తే మళ్లీ వలసలు ప్రారంభ మవుతాయని హెచ్చరించారు. కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు, అదానీ-అంబానీలకు ప్రజలను కూలీలుగా మార్చేందుకు ఉపాధి హామీని రద్దు చేస్తున్నారని విమర్శించారు. వికసిత్ భారత్ కాదు.. సంక్షోభ భారత్‌ను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. నల్ల చట్టాల విషయంలో క్షమాపణ చెప్పే వరకు వదల్లేదని.. ఇప్పుడు ఉపాధి హామీ విషయంలోనూ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ ఆరోపించారు.

ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తల పాత్రను ముఖ్యమంత్రి రేవంత్ కొనియాడారు. కార్యకర్తల కష్టం, త్యాగాలతోనే అధికారంలో ఉన్నామని.. వచ్చిన పదవులన్నీ కార్యకర్తలు ఇచ్చినవేనని చెప్పారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ ఎన్నికల్లో 66 శాతంపైగా కాంగ్రెస్ గెలిచిందని, మున్సిపల్ ఎన్నికల్లోనూ గెలవాలని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడినవాడు ఎప్పుడూ నష్టపోడని తెలిపారు. కాంగ్రెస్ మంత్రులంతా కష్టపడి పైకొచ్చినవారేనని, పార్టీ అవకాశం ఇస్తే

తనతోపాటు ఎవరికైనా గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు.

## మహిళా మంత్రులకు కెసిఆర్ ఆత్మీయ స్వాగతం

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ గురువారం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి.. మేడారం జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. మేడారం ప్రసాదం అందజేసి.. మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న జాతరను సందర్శించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా.. తన ఇంటికి వచ్చిన ఆడబిడ్డలను ఆత్మీయంగా పలకరించి.. సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్ దంపతులు సాంప్రదాయ పద్ధతిలో సత్కరించారు. కేసీఆర్ దంపతులు ఇచ్చిన తేనీటి విందు స్వీకరించిన మంత్రులు.. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత, ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న మహిళా మంత్రులకు మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ ఆహ్వానం పలికారు.

తన ఇంటికి వచ్చిన రాష్ట్ర మహిళా మంత్రులను 'బాగున్నరా అమ్మ' అంటూ ఆత్మీయంగా పలకరించారు.

వారికి సాదర స్వాగతం పలికారు. కేసీఆర్, ఆయన సతీమణి శోభమ్మ వారికి అతిథి మర్యాదలు చేశారు. సంప్రదాయం ప్రకారం పసుపు కుంకుమలు, చీర, తాంబూలాలతో ఆ ఆడబిడ్డలను సత్కరించారు.

ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఆహ్వాన పత్రికను అందజేశారు. అదేవిధంగా మేడారం ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ దంపతులు అందించిన తేనీటి విందును మహిళా మంత్రులు స్వీకరించారు. కాసేపు పరస్పర యోగక్షేమాల గురించి వారు మాట్లాడుకున్నారు. ఇష్టాగోష్టి అనంతరం మహిళా మంత్రులు తిరుగు ప్రయాణం అయ్యారు. అంతకుముందు మహిళా మంత్రులు ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసం దగ్గర వాహనాలు దిగగానే మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ వారికి పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా ఆహ్వానించారు.

# కృష్ణా జలాలపై పదేపదే రాజకీయాలు

మొదటిపేజీ తరువాయి

పోతిరెడ్డిపాడు ద్వారా 4 టీఎంసీల నీటిని ఏపీకి తరలించారు. దీన్ని గతంలో అడ్డుకోలేదు. కాంగ్రెస్, కేసీఆర్ చేసిన మోసాలు చూస్తే నాకు ఆశ్చర్యం వేసిందని బండి సంజయ్ అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా జలాల విషయంలో రెండు రాష్ట్రాల్లో చర్చ జరుగుతుంది.. ప్రజల దృష్టి మరల్చడానికే కాంగ్రెస్, బీఆర్ఎస్ పొలిటికల్ డ్రామా ఆడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ముఖ్యమంత్రి ఇరిగేషన్ విషయంలో అసెంబ్లీ వేదికగా పచ్చి అబద్ధాలు మాట్లాడారన్నారు. మేము నదీజలాలపై కొట్లాడినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఫీల్డ్ లో లేదు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి అండగా ఉందన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ తామే ప్రారంభించామని కాంగ్రెస్ అంటోంది.. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పాలమూరు రంగారెడ్డి పేరు ఎందుకు లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రానికి ఇది మరణశాసనం. వాళ్లే జాతీయ హోదా ఇవ్వలేదు అని లొల్లి చేస్తున్నారన్నారు. రీ ఆర్గనైజ్ యాక్ట్ లో 6 ప్రాజెక్ట్ లు మాత్రమే ఉన్నాయి.. పునర్విభజన చట్టంలో లేని పాలమూరు ప్రాజెక్ట్ కు జాతీయ హోదా ఎలా ఇస్తారు..? అని నిలదీశారు. కృష్ణా జలాల విషయంలో అన్యాయం జరిగిందన్నారు.. పోతిరెడ్డిపాడు విషయంలో ఆ రెండు పార్టీలు నోరు మెదపలేదు. కేసీఆర్ ప్రకటనలకు పరిమితం అయ్యారని బండి సంజయ్ అన్నారు.. కృష్ణా నది మీ జాగీరా? అణు బాంబు అయితా అన్నాడు కేసీఆర్.. అణుబాంబు కాదు తోక పటాక్ కూడా కాలేదు. ఉమాభారతి సమక్షంలో జరిగిన మీటింగ్ లో 299 టిఎంసిలు కృష్ణా నదిలో వాటా చాలు అన్నారు. దానికి కేసీఆర్ వద్ద సమాచారం లేదు. తెలంగాణకు కృష్ణా జలాల్లో అన్యాయం చేసింది కేసీఆర్? ఈ విషయాన్ని నేనే బయట పెట్టాను.. వెంటనే నేను అన్నది తప్పు అన్నారు కేసీఆర్. ఆంధ్ర వాళ్ళతో కమిట్ అయ్యి.. ఇక్కడ ఉల్టా డైలాగులు కొట్టారు. కాళేశ్వరం అని రూ. లక్ష కోట్లు మింగి కూలేశ్వరం కట్టారు. రెండవ దఫాలో కృష్ణా మీద కన్నేసి.. పాలమూరు రంగారెడ్డి కి సిద్ధమయ్యారు. రూ. 80వేల కోట్ల అంచనాతో మొదలు పెట్టి రూ. 20 వేల కోట్లు ఖర్చు చేశారు.

ఇరవై ఏడువేల కోట్లు పెడితే చుక్క నీరు రాలేదు. లిఫ్ట్‌లు రిజర్వాయర్ల కోసం రూ. 80 వేల కోట్లు అని.. ఓ అంచనా లేకుండా రూ. లక్ష 50వేల కోట్లు ఖర్చు అయి ఉంటాయి అన్నారు. కృష్ణా జలాల విషయంలో 2016, 2020 లో రెండుసార్లు అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ జరిగింది. మొదటిసారి మిస్టేక్ అనుకుందాం? రెండోసారి మీటింగ్ 2020 లో జరిగింది?. అప్పుడైనా సరిదిద్దుకోవాలి కదా.. ఆ మీటింగ్ లో కూడా 299 టీఎంసీలకే ఒప్పుకున్నారు.. జగన్ ప్రగతి భవన్ కి వచ్చారు.. ఇద్దరూ కలిసిన విషయం ఫార్మాలిటీ అన్నారు.. ఆనాడు నేను ప్రశ్నిస్తే నన్ను విమర్శించారు. వెంటనే బేసిన్లు లేవు భేషజాలు లేవు అన్నారు. రాయలసీమ ఎత్తిపోతల జరుగుతుంటే ఆపలేదు. రోజా ఇంటికి పోయి రొయ్యల కూర చేపల పులుసు తిని వచ్చారు. రాయలసీమను రత్నాల సీమ చేస్తా అని చెప్పి.. పెద్దన్న పాత్ర పోషిస్తా అన్నారు. కవిత కూడా ఆ రోజు పట్టుబట్టలు పెట్టారు. ఆరోజు జరిగిన సమావేశంలో ఏమి జరిగిందో కవిత బయటపెట్టాలని బండి డిమాండ్ చేశారు. బీజేపీ అండ ఉంది. కవిత దావత్ వద్దన్నదని నాకు సమాచారం ఉంది. ఇప్పుడు చెప్పాలి? రోజా ఇంట్లో నాన్ వెజ్ తిని తిరుమల యాత్ర రద్దు చేసుకున్నారు. రాయలసీమ ఎత్తిపోతల విషయంలో అన్యాయాన్ని నిరసిస్తూ మేము ఇళ్లపై నల్లజెండాలు ఎగరవేశాం.. అని సంజయ్ వెల్లడించారు.

# రాయలసీమకు ద్రోహం చేస్తున్న చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి

రాయలసీమ ఎత్తిపోతలపై కూటమి ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోందని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కరువు కోరల్లో చిక్కుకున్న ప్రాంతానికి నీళ్లు ఇవ్వాలనుకున్నామని అన్నారు. రాయలసీమకు తాము తలపెట్టిన ఎత్తిపోతల.. సంజీవని లాంటిదని చెప్పుకొచ్చారు. నెల్లూరు, రాయలసీమ ప్రజలు చంద్రబాబును విలన్‌లా చూస్తున్నారని ఆరోపించారు. సీఎం సీట్లో కూర్చుని చంద్రబాబు ఏపీ ప్రయోజనాలను తాకట్టుపెట్టారని విమర్శించారు. గురువారం తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ మోహన్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. 'సొంత రాష్ట్రాన్ని తన స్వార్థ ప్రయోజనాలకు తాకట్టుపెట్టారు. రాయలసీమ ఎత్తిపోతలపై రేవంత్ వ్యాఖ్యలే సాక్ష్యం. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో చంద్రబాబు రహస్య ఒప్పందానికి అధికార ముద్ర వేశారు. రాయలసీమ లిఫ్ట్ అవసరం లేదని మంత్రులు మాట్లాడుతున్నారు. రాయలసీమ లిఫ్ట్ వెనుక గొప్ప ఉద్దేశ్యం ఉంది. రాయలసీమ ఎత్తిపోతల ఆపమని కోరినట్లు సీఎం రేవంత్ ప్రకటించారు. రేవంత్ వ్యాఖ్యలు చూస్తే చంద్రబాబు ఏపీని అమ్మకానికి పెట్టారని చెప్పడానికి నిదర్శనం. శ్రీశైలంలో 881 అడుగులు ఉంటేనే పోతిరెడ్డిపాడుకు నీళ్లు వస్తాయి.. పోతిరెడ్డిపాడు నుంచి 101 టీఎంసీల కేటాయింపులు ఉన్నాయి. ఇరవై ఏళ్లలో మూడు, నాలుగుసార్లే అన్ని నీళ్లు తెచ్చుకోగలిగాం' అని అని వైఎస్ జగన్ తెలిపారు. 800 అడుగుల్లోపే 2 టీఎంసీల నీళ్లు తీసుకునేందుకు.. తెలంగాణలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు చేపట్టారు. ఎస్‌ఎల్‌బిసితో 45 టీఎంసీలు తరలించేలా పనులు జరుగుతున్నాయి. 777 అడుగుల నుంచే లెఫ్ట్ పవర్‌హౌస్ ద్వారా..4 టీఎంసీల నీళ్లు తెలంగాణ ఖాళీ చేస్తున్న పరిస్థితి. మనకు నీళ్లు లేకుండా ఇబ్బందులు పడుతున్నాం. తెలంగాణలో పవర్‌హౌస్ ద్వారా ఇష్టారీతిన నీళ్లు తీసుకుంటున్నారు. తెలంగాణలో లిఫ్ట్‌లు, పవర్‌హౌస్‌తో రోజుకు 8 టీఎంసీలు తీసుకుంటున్నారు. శ్రీశైలం, సాగర్, పులిచింతల పవర్‌హౌస్‌లు తెలంగాణెళి ఆపరేట్ చేస్తోంది. ఓటుకు నోటు కేసులో ఆడియో, వీడియోలతో అడ్డంగా దొరికారు. అందుకే చంద్రబాబు నోరు మెదపలేని పరిస్థితి ఉందని జగన్ ఎద్దేవా చేశారు. మేం వచ్చే నాటికే తెలంగాణలో లిఫ్ట్‌ల పనులు జోరుగా సాగుతున్నాయి. తెలంగాణ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు లేవని వైఎస్ జగన్ పేర్కొన్నారు. చంద్రబాబు దగ్గరుండి రాయలసీమ లిఫ్ట్ ను ఖూనీ చేశారన్నారు. చంద్రబాబు, ఆయన మంత్రి కలిసి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ అక్కర్లేదని మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. స్టెబిలైజింగ్ రిజర్వాయర్లు కట్టకపోతే కుప్పానికే కాదు చిత్తూరు జిల్లాకు తాగునీళ్లు ఉండవని జగన్ తెలిపారు. విద్యుత్ ఛార్జీలు పెంచను అని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు బాదుడే బాదుడుతో ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి రెండు ఏళ్ళు గడవక ముందే రాష్ట్రం రూ. 3 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసారని తెలిపారు. సంపద సృష్టిస్తానని చెప్పి రాష్ట్రాన్ని అప్పుల దిశగా నడిపిస్తున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలని కోరారు. మెడికల్ కాలేజీల కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తుంది.. కానీ లాభాలు మాత్రం ప్రైవేటు వాళ్లకే. ఇది స్కాం కాక మరేమిటని ప్రశ్నించారు. చంద్రబాబు స్కాంలకు కాదేది అనర్హమని అన్నారు. ఇసుక.. లిక్కర్.. ఆఖరికి రేషన్ బియ్యంలోనూ స్కాంలేనని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను 19 నెలల్లోనే స్కామాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని తెలిపారు. ప్రజల నుంచి దోచుకోవడానికి దొడ్డిదారులు వెతుకుతున్నారని, చార్జీలు, టోల్‌లు, సెస్‌ల పేరుతో ఇష్టమొచ్చినట్లు జనాలపై ఆర్థిక భారం మోపుతున్నారని తెలిపారు. బాదుడుతో సంపద సృష్టిస్తున్నారా అని ప్రశ్నించారు. గతంలో రాయలసీమలో ఉన్న ఏ ప్రాజెక్టునూ పూర్తిగా వాడుకోలేని పరిస్థితులు ఉండేవని, 40ఏళ్ల అనుభవం అని చెప్పుకునే చంద్రబాబు రాయలసీమలో ఉన్న ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో నీళ్లు నింపలేకపోయారని తెలిపారు. ఎన్జీటి అభ్యంతరాల తర్వాత కేంద్రం నుంచి ఎక్స్పర్ట్ అప్రైజల్ కమిటీ మూడుసార్లు సమావేశమైతే రాష్ట్రం తరఫున చంద్రబాబు కనీసం నోరు మెదపలేదని జగన్ తెలిపారు.

# సిపిఐ వందేళ్ల ప్రస్థానంపై ఖమ్మంలో సభలు

మొదటిపేజీ తరువాయి

సిపిఐ వందేళ్ల ప్రస్థానం పురస్కరించుకుని ఖమ్మం నగరంలో ఈ నెల 18వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ తెలిపారు. సీపీఐ జాతీయ నాయకులంతా ఈ బహిరంగ సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. 18వ తేదీన నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సంఘీభావంగా ఈ ర్యాలీలో పాల్గొంటారని పేర్కొన్నారు. గురువారం ఖమ్మం జిల్లాలో రామకృష్ణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌కు వెళ్లారు. అక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ..సీపీఐ ఆవిర్భావం నుంచి పోరాటాల పంథా కొనసాగించిందని తెలిపారు. పేదలు, కార్మికుల హక్కుల కోసం ఎంతోమంది జైలుకు వెళ్లారని అన్నారు. దేశం కోసం సీపీఐ ఎన్నో త్యాగాలు చేసిందని ప్రస్తావించారు. వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పోరాటాల గడ్డ ఖమ్మంలో శతాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో ఖమ్మంలో జాతీయ కౌన్సిల్ సమావేశం ఉంటుందని తెలిపారు. 20వ తేదీ వామపక్ష పార్టీల జాతీయ నాయకులు ఆహ్వానించి సెమినార్ ఏర్పాటు చేశామని అన్నారు. 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగే ఈ సెమినార్‌కు ఎనలేని ప్రాధాన్యత ఉందని వివరించారు. ఈ సెమినార్‌లో వామపక్ష పార్టీలు పాల్గొంటాయని వెల్లడించారు. వామపక్ష పార్టీలు దేశంలో ఇతర పార్టీలను కలుపుకొని పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు రామకృష్ణ. ప్రపంచాన్ని బెదిరించాలనే దుస్సాహసానికి ట్రంప్ పాల్పడ్డారని ,ఇంత జరుగుతున్నా.. ప్రధాని నరేంద్రమోదీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తనను సంతృప్తిపరచాల్సిన బాధ్యత మోదీపై ఉందని డొనాల్డ్ ట్రంప్ ఇటీవల అన్నారని ప్రస్తావించారు. ఒకప్పుడు ప్రపంచ దేశాలకు నాయకత్వం ఇచ్చిన ఇండియా.. ఇప్పుడు మాట్లాడలేని పరిస్థితికి ఎందుకు దిగజారిందని నిలదీశారు. మోదీ పాలనలో ప్రపంచ దేశాల్లో భారతదేశానికి విలువ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ పిచ్చోడి చేతిలో రాయిలాగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఒక దేశ అధ్యక్షుడి ఇంటిపై దాడి చేసి కిడ్నాప్ చేసే నీచ స్థితికి ట్రంప్ దిగజారారని షాకింగ్ కామెంట్స్ చేశారు.

పోలవరం ముంపు ప్రాంతాల మండలాల్లో ఈరోజు(గురువారం) సమావేశం ఉందని రామకృష్ణ తెలిపారు. ఏపీ ముఖ్యమంత్రి 2027 మార్చి నాటికి పోలవరం పూర్తిచేసి జాతికి అందిస్తామని అంటున్నారని అన్నారు. పోలవరం పూర్తిచేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. పోలవరం ఏర్పాటుకు త్యాగాలు చేసిన భూ నిర్వాసితుల పరిస్థితి గురించి మాట్లాడటం లేదని అన్నారు. ఆగస్టు నెల వస్తే ఆ మండలాల్లోనే గ్రామాలు మునిగిపోతున్నాయని చెప్పుకొచ్చారు. 135 అడుగుల వరకు మాత్రమే సాయం చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతోందని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు నాయుడు పోలవరం ముంపు బాధితులను గాలికి వదిలేశారని ఆరోపించారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ డిమాండ్ చేస్తోందని అన్నారు. మావోయిస్టుల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఆపరేషన్ కగార్‌ను సీపీఐ పార్టీ ఖండిస్తోందని తెలిపారు. తక్షణమే నక్సల్స్‌తో చర్చలు జరపాలని కోరారు. మావోయిస్టు అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్ కూడా బూటకమేనని, పట్టుకొచ్చి కాల్చి చంపారని ఆరోపణలు చేశారు. ప్రశ్నించే వాళ్లని అర్బన్ నక్సల్స్ పేరుతో కేంద్ర ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని రామకృష్ణ విమర్శించారు.

## హెచ్‌టి పత్తి విత్తనాలను అడ్డుకోండి

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో అనధికారకంగా, అనుమతిలేని పత్తి విత్తనాల ప్యాకెట్ల అమ్మకాలను అరికట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. పత్తి విత్తనాల ప్యాకేట్లపై వ్యవసాయశాఖ సంచాలకులతో సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ అనుమతిలేని హెచ్‌టి పత్తి విత్తనాలను రాష్ట్రంలో అమ్మకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పత్తి రకాన్ని అమెరికాకు చెందిన మోన్సాంటో కంపెనీ కనుగొన్నప్పటికి, ఫీల్డ్ ట్రయల్స్ లో ఫెయిల్ అవడం మరియు దీనివలన పర్యావరణానికి కలిగే అనర్థాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఈ పత్తి రకానికి అనుమతులు ఇవ్వలేదని మంత్రిగారు తెలిపారు. అయినప్పటికి కొందరు దళారులు తమ ప్రయోజనాల కోసం రైతులకు ఊ÷ు పత్తి విత్తనాలను అనధికారకంగా రైతులకు అంటగడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 20 అధీకృత పత్తి విత్తన కంపెనీలు విత్తనోత్పత్తి చేస్తుండగా, ప్రభుత్వం సర్టి÷డ్ చేసిన మరో 40 వివిధ కంపెనీలు రాష్ట్రానికి పత్తి విత్తన ప్యాకెట్లను సరఫరా చేస్తున్నాయన్నారు. గత సంవత్సరం ఈ కంపెనీల ద్వారా సరఫరా అయిన 1.10 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లను రైతుల కొనుగోలు చేశారన్నారు. కొందరు దళారులు కేంద్ర ప్రభుత్వం బ్యాన్ చేసిన హెచ్‌టి విత్తనాలతో పాటు కల్తీ విత్తనాలను మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి తెలంగాణ సరిహద్దు ప్రాంతాలలోని రైతులకు అమ్ముతున్నట్టు గుర్తించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 52 లక్షల ఎకరాలలో పత్తి సాగయ్యే అవకాశం ఉందని, దీనిని ఆసరా చేసుకొని దళారులు ఊ÷ు విత్తనాలు మరియు కల్తీ విత్తనాలను రాష్ట్రంలోకి తెచ్చే అవకాశం ఉన్నందున, ఈ నెల నుంచే సరిహద్దు ప్రాంతాలలో టాస్క్ ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసిన పత్తి విత్తనాల అక్రమ రవాణాలను అరికట్టే విధంగా నిఘా ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా కో-మార్కెటింగ్ కు సంబంధించి విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ రకం పత్తి విత్తనాలను రైతులు కొనకుండా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా కలుపును తట్టుకుంటుందని, అధిక దిగుబడి వస్తుందని పత్తి విత్తనాలను కొనవద్దని ఈ సందర్భంగా మంత్రి రైతులను కోరారు. ఈ విత్తనాలను వాడటం వలన అధికంగా కలుపు మందు వాడాల్సి వస్తుందని, దీంతో పర్యావరణానికి హాని కలగడంతోపాటు జీవ వైవిధ్యం దెబ్బతిని, ఇతర పత్తి హైబ్రిడ్ లు కూడా కలుషితం అవుతాయని వివరించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సంచాలకులు డా.గోపితో పాటు వ్యవసాయశాఖ అధికారులు మరియు విత్తన కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలతో కాంగ్రెస్ సన్నద్ధం

మొదటిపేజీ తరువాయి

వీటిని పర్యవేక్షించే బాధ్యతను రాష్ట్ర పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కట్టబెట్టింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు వేదికగా నిర్వహించే బహిరంగ సభకు పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలను ఆహ్వానించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. మండలాల్లో సైతం ఈ సభలను విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఒక మండలం బాధ్యతను తాను తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు ఆరోపిస్తున్నాయి. అలాగే ఏపీ ప్రభుత్వం అక్రమ నీటి ప్రాజెక్ట్‌లు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోందని.. ఈ వ్యవహారంలో రేవంత్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందంటూ బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలు వరుసగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విమర్శలు తిప్పికొట్టేందుకు ఈ భారీ బహిరంగ సభలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అంతేకాకుండా ఈ సభల వేదిక మీద నుంచి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత.. ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, మహాలక్ష్మి తదితర పథకాలు అమలును వివరించడం ద్వారా ప్రతిపక్ష విమర్శలు తిప్పికొట్ట వచ్చనే లక్ష్యంలో ఈ కీలక నిర్ణయాన్ని ఆ పార్టీ తీసుకుంది. అంతేకాకుండా.. ఆయా జిల్లాల్లోని స్థానిక సమస్యలతోపాటు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసే దిశగా తమ ప్రభుత్వం ముందుకు వెళ్తుందంటూ ఈ సందర్భంగా ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇంకోవైపు రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వ తీరును ఎండగడతామంటూ బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. ఇందుకోసం భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామంటూ ఆయన ఇప్పటికే మీడియా వేదికగా స్పష్టమైన ప్రకటన చేశారు. అలాంటి వేళ బీఆర్ఎస్ పార్టీ కంటే ముందే భారీ బహిరంగ సభలు నిర్వహించడం ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఆ దిశగా ఆ పార్టీ అగ్రనాయకత్వం వడివడిగా అడుగులు వేస్తోంది.

## నిరుద్యోగులపై దమనకాండ దారుణం

మొదటిపేజీ తరువాయి

నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లపై రేవంత్ సర్కారు సాగిస్తున్న దమన కాండపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా మండిపడ్డారు. నిన్న దిల్‌సుఖ్‌నగర్, నేడు అశోక్ నగర్‌లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నిరుద్యోగులపై పోలీసులు క్రూరంగా విరుచుకుపడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికలకు ముందు అశోక్ నగర్ లైబ్రరీ చుట్టూ చక్కర్లు కొట్టి పొర్లుదండాలు పెట్టి నిరుద్యోగులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకున్నారు. వారి ఉద్యోగ కాంక్షను ఆసరా చేసుకొని, వారిని కాంగ్రెస్ కార్యకర్తలుగా మార్చుకొని ఇంటింటికి తిప్పి ప్రచారానికి వాడుకుని.. అధికార పీఠం ఎక్కగానే అదే నిరుద్యోగ గొంతులపై ఉక్కు పాదం మోపి తొక్కుతున్నారని హరీష్ రావు ఆరోపించారు. ఇవాళ తెలంగాణలో నిరంకుశత్వం రాజ్యమేలుతున్నది. పోలీసు రాజ్యం నడుస్తున్నది. ఓడ దాటే దాకా ఓడ మల్లన్న, ఓడ దాటినాక బోడ మల్లన్న అన్నట్లు ఇప్పుడు నిరుద్యోగులకు లాఠీ చార్జీలు, అరెస్టులు, సంకెళ్లను బహుమతిగా ఇస్తున్నారని హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలని మోసం చేశారు. నిరుద్యోగ భృతి పేరిట నయవంచన చేశారని మండిపడ్డారు. రెండేళ్లలో 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా 60వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నవు..నీ తప్పుడు ప్రచారంపై కడుపు మండిన విద్యార్థులు, నిరుద్యోగులు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నవు. నెలల తరబడి విద్యార్థులు, నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తుంటే నువ్వు ఢిల్లీకి చక్కర్లు కొడుతూ కాలం వెళ్లదీస్తున్నవని సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు

# అత్యంత గొప్ప పథకం కళ్యాణ లక్ష్మ పథకం





» నిరుపేద తల్లిదండ్రులకు వరం కళ్యాణ లక్ష్మ పథకం

» పేదింటి ఆడబిడ్డల పెళ్ళికి రాష్ట్ర ప్రభుత్వం లక్ష 116 రూపాయల ఆర్థిక సహాయం

కరపత్రం ప్రతినిది జనవరి 8

నిరుపేద కుటుంబానికి కళ్యాణ లక్ష్మ/షాది ముబారక్ పథకం గొప్ప వరం లాంటిదని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం జఫర్ గడ్ మండల కేంద్రంలోని రైతు వేదికలో.. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మ, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జఫర్ గడ్, ఐనవోలు మండలాలకు సంబంధించిన 77 మంది కళ్యాణ లక్ష్మ లబ్ధిదారులకు రూ. 77 లక్షల 08 వేల 932 రూపాయల విలువగల చెక్కులను, 30 మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు రూ. 10లక్షల 52వేల 500 రూపాయల విలువగల చెక్కులను పంపిణి చేశారు. అలాగే స్టేషన్ ఘనపూర్ మండలానికి సంబంధించిన 66మంది కళ్యాణ లక్ష్మ లబ్ధిదారులకు రూ. 66 లక్షల 07వేల 656 రూపాయల విలువగల చెక్కులను 22మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 11లక్షల 18వేల 500 రూపాయల విలువగల చెక్కులను పంపిణి చేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం లో ఎక్కడా అవినీతి, అక్రమాలకు అవకాశం లేకుండా సంక్షమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. కళ్యాణ లక్ష్మ లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న రెండు నెలలో చెక్కులు అందజేస్తున్నామని, ఇందుకు ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎవరైనా డబ్బులు అడిగితే తనకు చెప్పాలని సూచించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజా సంక్షమ పథకాలను అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ నిలుస్తుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేద ప్రజలకు ఉచిత సన్న బియ్యం పంపిణి, నిరుపేద కుటుంబాలకు రేషన్ కార్డులు, ఇల్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే జనగామ జిల్లా మొదటి స్థానంలో ఉందని అందుకు కారణం మన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గమే నని తెలిపారు. నియోజకవర్గంలో 93% ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టమని అన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. కొంత మంది హౌలాగాళ్ళు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నిస్సిగ్గుగా మాట్లాడటం వాళ్లకు అలవాటైందని అన్నారు. ఒకాయన నేనే 100 పడకల అస్పత్రి తెచ్చాను అంటాడు. మళ్ళీ స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ కాకుండా అడ్డుపడ్డానని అంటాడు. ఇలా మాట్లాడే వాళ్లకు చదువు వస్తుందా, బుద్ధి జ్ఞానం ఏమైనా ఉన్నాయా అని దుయ్యబట్టారు. జనవరి 2024తర్వాత వచ్చిన జీవోల ఆధారంగానే నియోజకవర్గానికి మంజూరు అయిన అభివృద్ధి పనుల వివరాలను జీవో కాపీలతో సహా మీడియా ముందు, ప్రజల ముందు పెట్టానని స్పష్టం చేశారు. అయిన కూడా ఇలా మాట్లాడే వారిని ఏమనాలో నాకు అర్థం కావడం లేదని తెలిపారు. నాకున్న ఏకైక లక్ష్యం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రగతి, ప్రజల సంక్షమం మాత్రమేనని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఘనపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, తహసీల్దార్లు, సర్పంచులు,ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

6

# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





కరపత్రం ప్రతినిది జనవరి 8

హన్మకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రానికి చెందిన వరంగల్ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు నకరగంటి మోహన్ తల్లి నకరగంటి రాంబాబు అనారోగ్యంతో మృతి చెందగా.., గురువారం వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, మాజీ టెస్కాబ్ ఛైర్మన్ మార్నెనీ రవీందర్ రావు వారి నివాసానికి వెళ్లి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం ఉడుతగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జన్నపురెడ్డి చంద్రరెడ్డి సతీమణి జన్నపురెడ్డి రమాదేవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే నాగరాజు వెంట ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామానికి గోదావరి జలాలు అందివ్వడమే నా లక్ష్యం







» అధికారులు సమస్యలు పరిష్కరిస్తూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

కరపత్రం ప్రతినిది జనవరి 8

కడియం శ్రీహరి ద్వారానే దేవాదుల ప్రాజెక్టు వచ్చింది.... కడియం శ్రీహరి ద్వారానే ప్రతీ ఎకరానికి గోదావరి నీళ్లు వచ్చాయి అని ప్రజలు గుర్తుంచుకోవాలి అనే సంకల్పంతోనే దేవాదుల ప్రాజెక్టు ఫెజ్ -3 ప్యాకేజీ -6 పనులు పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నానని, ప్రతి గ్రామానికి గోదావరి జలాలు అందించడమే తన లక్ష్యమని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం జఫర్ గడ్ మండలం సాగరం గ్రామ సమీపంలో చేపట్టిన దేవాదుల ప్రాజెక్ట్ ఫెజ్ -3, ప్యాకేజి -6పనులను నీటి పారుదల, రెవెన్యూ అధికారులు, రైతులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు పరిశీలించారు. ఈ సందర్భంగా కాలువల నిర్మాణ పనులను క్షత్ర స్థాయిలో పరిశీలించి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. 2003-04 లో భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే ఉమ్మడి వరంగల్ జిల్లాకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో దేవాదుల ప్రాజెక్టును ప్రారంభించడం జరిగిందని తెలిపారు. 6 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు రూపొందించిన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం సవరించిన అంచనాలతో రూ. 18వేల 400 కోట్లకు పెరిగిందని అన్నారు. ఒకప్పుడు కరువు ప్రాంతంగా ఉన్న జనగామ ప్రాంతం నేడు దేవాదుల ప్రాజెక్టుతో రాష్ట్రంలోనే అత్యధిక వరిధాన్యం పండిస్తున్న ప్రాంతంగా నిలిచిందని వెల్లడించారు. దేవాదుల ప్రాజెక్టు ఫెజ్-3, ప్యాకేజీ-6 పనులను 2027జూన్ నాటికీ పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఇందుకు రైతులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సహకారం కావాలని కోరారు. రైతులు సహకరిస్తేనే పనులు త్వరితగతిన పూర్తి చేయగలుగుతామని తెలిపారు. ఒక్క జఫర్ మండలం లోనే ప్యాకేజి-6ద్వారా 10వేల ఎకరాలకు సాగు నీరు అందనుందని అన్నారు. దంసా కాలువ, బంజరు మాటు, బొల్ల మత్తడి ని మారమ్మత్తు చేయాలని నీటి పారుదల అధికారులకు సూచించారు. దంసా చెరువు, జఫర్ గడ్ చెరువులను మారమ్మత్తు చేసి నష్కల్ నుండి పాలకుర్తి ప్రధాన కాలువ ఓటి ఏర్పాటు చేసి దంసా చెరువు, జఫర్ గడ్ చెరువులను నింపి 365 రోజులు నీళ్లు ఉండే విధంగా చేయాలని వివరించారు. రైతుల భూ సమస్యల పరిష్కారానికి త్వరలోనే జఫర్ గడ్ మండల కేంద్రంలో రెవెన్యూ, నీటిపారుదల అధికారులు, రైతులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తానని తెలిపారు. రెవెన్యూ అధికారులు గ్రామాల వారీగా ఉన్న భూ సమస్యలపై రిపోర్ట్ తయారు చేయాలని ఆదేశించారు. రైతులు కాలువల నిర్మాణానికి సహకరించాలని అలాగే అధికారులు ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే వాటిని పరిష్కరించి పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని సూచించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం లోని ప్రతీ ఎకరానికి రెండు పంటలకు సాగు నీరు అందించడమే ఏకైక లక్ష్యంగా పని చేస్తున్నాని, లక్ష్యం నెరవేరాలంటే మనందరం కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ సిఈ సుధీర్, ఎస్ఈ సీతారాం, ఈఈ మంగీలాల్, డీఈలు, ఏఈలు, తహసీల్దార్, ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం ఎమర్జెన్సీ బాధితులను ఆదుకోవాలి

» ఎమర్జెన్సీ కాలంలో పనిచేసిన స్వాతంత్ర సమర యోధులను కేంద్ర ప్రభుత్వం గుర్తించాలి

» బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావుకు వినతి పత్రం అందజేత





కరపత్రం ప్రతినిది జనవరి 8

ఎమర్జెన్సీ కాలంలో పనిచేసిన స్వాతంత్ర సమర యోధులను కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని భారతీయ సురక్ష సమితి జిల్లా అధ్యక్షులు చిట్టి మల్ల శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం హనుమకొండ బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం చిట్టిమల్ల శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ 1975వ సంవత్సరంలో ఎమర్జెన్సీ ని విధించి ప్రజాస్వామ్యాన్ని కూల్చిన సందర్భంగా జయప్రకాశ్ నారాయణ ఆధ్వర్యంలో దేశం మొత్తం మీద ఒక ప్రత్యేక మైనటువంటి ఉద్యమం జరిగిందని, రెండవ స్వాతంత్ర సంగ్రామంగా భావించేటువంటి ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటం విస్తృతంగా జరిగిందన్నారు.ఆ సందర్భంగా దాదాపు లక్షల మంది ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలబడ్డారు. అలాంటి సందర్భంలో వరంగల్ జిల్లాలో కూడా అనేక మంది కార్యకర్తలు జైలు పాలయ్యారు, ప్రత్యేకంగా తయారు చేసినటువంటి చట్టాలు ఏవైతే ఉన్నాయో మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ(మీసా) అని పెట్టీ అందరినీ జైల్లో తోసి, ప్రజాస్వామన్ని హత్య పడిందన్నారు. ఆ సందర్భంగా ఇక్కడ పోరాట యోధులకు ప్రభుత్వపరంగా గుర్తింపు కావాలని చెప్పి దాన్ని రెండవ స్వాతంత్ర సంగ్రామంగా గుర్తించాలని చెప్పి కేంద్ర ప్రభుత్వానికి విన్నవించాలని ఉద్దేశంతోనే ఈ సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు కు వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. దేశవ్యాప్తంగా కొన్ని బిజెపి పాలిత ప్రాంతాలలో స్వాతంత్ర సమరయోధులుగా గుర్తించిందని, తెలంగాణ ప్రాంతంలో కూడా తమను గుర్తించి ఆదుకోవాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యాద కృష్ణరావు, సభ్యులు భయ్యా సారయ్య, డోలి సత్యనారాయణ, చంద్రయ్య, ఎండి. జమాల్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంత పోలీసు అధికారుల సేవలు చిరస్మరణీయం

» ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్రాంత పోలీస్ అధికారుల సంక్షమ సంఘం నూతన సంవత్సరఉ2026 డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాగరాజు, చైర్మన్ జంగా





కరపత్రం ప్రతినిది జనవరి 8

సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం జీవితాంతం అంకితభావంతో సేవలందించిన విశ్రాంత పోలీసు అధికారుల సేవలు చిరస్మరణీయమని వర్ధన్నపేట ఎమ్మెల్యే .ఆర్ నాగరాజు, రాష్ట్ర ఆయిల్ ఫీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్రాంత పోలీసు అధికారుల సంక్షమ సంఘం నూతన సంవత్సరఉ2026 డైరీని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు, రాష్ట్ర ఆయిల్ ఫీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆవిష్కరించారు. తొలుత మరణించిన పోలీస్ అధికారులు 2 నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పోలీస్ సంక్షమ సంఘం సభ్యులకు హెల్త్ కార్డ్స్ పంపిణీ చేసి డైరీ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రజల భద్రతకే ప్రథమ ప్రాధాన్యం ఇచ్చిన పోలీసు అధికారులు సమాజానికి ఆదర్శమని ప్రశంసించారు. విశ్రాంతి అనంతరం కూడా సంఘాల ద్వారా ఐక్యంగా ఉంటూ సంక్షమ కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమని పేర్కొన్నారు.

అలాగే, నూతన సంవత్సరంఉ2026 విశ్రాంత పోలీసు అధికారులందరికీ ఆరోగ్యం, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు అందించాలని ఆకాంక్షంచారు. విశ్రాంత పోలీస్ అధికారుల సంక్షమ సంఘానికి 5 లక్షలు విరాళం అందజేస్తాను అన్నారు. అదే విధంగా సంఘానికి భవన స్థలం కోసం స్థానిక ఎమ్మెల్యేతో కృషి చేస్తాను అని హామీ ఇచ్చారు. మీ అంతా నా కుటుంబ సభ్యులు మీకు ఏ అవసరాలు ఉన్నా నా వంతు సహాయ సహకారాలు అందిస్తాను అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్రాంత పోలీసు అధికారుల సంక్షమ సంఘం అధ్యక్షుడు సంజీవ రెడ్డి, సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వరద కాలువల పునరుద్ధరణపై సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

కరపత్రం ప్రతినిది జనవరి 8



గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్యాలయంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వరద కాలువల పునరుద్ధరణపై మేయర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఇతర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. గ్రేటర్ వరంగల్ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు పూర్తి స్థాయి డీపీఆర్ (డి పి ఆర్) సిద్ధం చేయాలని సూచించారు. నగరం చుట్టూ ఉన్న ఓఆర్ఆర్, చెరువులను పరిగణలోకి తీసుకుని వరద కాలువల డీపీఆర్ రూపొందించాలని అన్నారు. చిన్న వర్షానికే ముంపుకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి, అక్కడ నాలాల నిర్మాణం చేపట్టాలని సూచించారు. వరద నీరు బయటకు వెళ్లే మార్గాలను సక్రమంగా గుర్తిస్తే నగరంలోని కాలనీలు ముంపు సమస్య నుంచి విముక్తి పొందుతాయని పేర్కొన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతో పాటు నాలాల నిర్మాణం సమాంతరంగా చేపట్టాలని, ఇందుకు అవసరమైన నిధులను ముఖ్యమంత్రి ని ప్రత్యేకంగా కోరుతూ మంజూరు చేయించుకుంటామని తెలిపారు. నగర ప్రజలకు వరద ముంపు కలగకుండా చేయడమే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని అన్నారు. అలాగే భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, ఈ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలు, స్థల సేకరణ వంటి అంశాలను క్షణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, ఆర్ అండ్ బి శాఖల అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# హనుమకొండలో రహదారి భద్ర్రత వారోత్సవాల ర్యాలీ





కరపత్రం ప్రతినిధి, వరంగల్ జనవరి 8

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ ఆదేశాలను అనుసరించి మొదటి అదనపు జిల్లా ప్రధాన న్యాయమూర్తిం -కం-చైర్మన్, న్యాయ సేవాధికార సంస్థ, హనుమకొండ బి. అపర్ణాదేవి రహదారి భద్రత వారోత్సవాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ రోజుల్లో అందరికి వాహనాలు అందుబాటులో ఉన్నాయని, అందరు కూడా భద్రత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. వాహన చోదకులు సురక్షతమైన బెల్ట్స్, సురక్షత దూరాలు పాటించి వాహనం నడపాలని తెలిపారు. గత సంవత్సరం దేశం మొత్తంలో 4.5 కోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగాయని, కొంత భద్రత ప్రమాణాలు పాటిస్తే ఇవి నిర్మూలించా గలుగుతామని తెలిపారు. వాహన చోదకులు డ్రైవింగ్ చేసేప్పుడు మొబైల్ ఫోన్ వాడవొద్దని, అతి వేగం ప్రాణానికి హాని అని తెలిపారు. వాహన చోదకులకు ప్రతి ఒక్కరికి భద్రత ప్రమాణాల అవగాహనా కోసం అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని, ఇందుకోసం సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో శ్రీ జి. రామలింగం, ప్రధాన సీనియర్ సివిల్ న్యాయమూర్తి -కం-కార్యదర్శి, న్యాయ సేవాధికార సంస్థ, హనుమకొండ, శ్రీమతి ఎన్,శాంతి సోని, ప్రధాన జూనియర్ సివిల్ న్యాయమూర్తి, సిహెచ్ . శ్రావణ స్వాతి, మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి, బి.అనూష, రెండవ అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి, ప్రియాంక సిరిసిల్ల, మూడవ అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి, పి. సత్యనారాయణ, అధ్యక్షులు-హనుమకొండ బార్ అసోసియేషన్, న్యాయ వాదులు, న్యాయ సిబ్బంది, జి. వేణుగోపాల్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్-హనుమకొండ, . సత్యనారాయణ, అసిస్టెంట్ కమీషనర్ అఫ్ ట్రాఫిక్ పాల్గొన్నారు.

## ఎర్దనూరు చౌడమ్మ జాతరలో పాల్గొన్న జగ్గారెడ్డి!

- ⊙చౌడమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన జగ్గారెడ్డి
- ⊙చౌడమ్మ తల్లికి సంబంధించిన విశేషాల గురించి ఒగ్గు కళాకారులు పాడిన పాటలు విన్న జగ్గారెడ్డి



హైదరాబాద్ జనవరి 8 కరపత్రం ప్రతినిది

కంది మండలం ఎర్దనూరు గ్రామంలో జరిగిన శ్రీ చౌడమ్మ తల్లి జాతర ఉత్సవంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాజరయ్యారు. చౌడమ్మ తల్లి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చౌడమ్మ తల్లి చరిత్ర గురించిన విశేషాలను వివరిస్తూ, ఒగ్గు కళాకారులు పాడిన పాటలను విన్నారు. ఎర్దనూరు గుట్టపైన కొలువైన దేవతామూర్తులను దర్శించుకున్నారు. చౌడమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి జూలకంటి ఆంజనేయులు, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రఘుగౌడ్, ఎర్దనూరు సర్పంచ్ పంబళ్ల జ్యోతి దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు మధు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కానిస్టేబుల్ కుటుంబానికి కోటి 31 లక్షల చెక్కును అందజేసిన డిజిపి

హైదరాబాద్ :జనవరి 8 కరపత్రం ప్రతినిది




రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ కుటుంబానికి బ్యాంక్ ఆఫ్ బరోడా ద్వారా అందాల్సిన బీమా మొత్తాన్ని డైరెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ బి శివధర్ రెడ్డి చేతుల మీదుగా ఆయన కార్యాలయంలో గురువారం నాడు అందజేశారు. అంబర్‌పేట సిపిఎల్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన బోయ పాండు, ఆయన భార్య గత ఏడాది మార్చి 25న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.బోయ పాండుకు బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఖాతా ఉండటంతో, ప్రమాదంలో దురదృష్టవశాత్తు మరణించిన ఆయన కుటుంబ సభ్యులకు రూ.కోటి 31 లక్షల చెక్కును డిజిపి అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ బరోడా డిజిఎం కె. మురళీకృష్ణ, సలహాదారు రిటైర్డ్ బ్రిగేడియర్ ఎస్.కె. ప్రసాద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కృత్రిమ మేథకు కేరాఫ్ అడ్రెస్ గా హైదరాబాద్

- ⊙ ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



హైదరాబాద్ జనవరి 8. కరపత్రం ప్రతినిది

కృత్రిమ మేథ సాంకేతికలో దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా హైదరాబాద్ పరుగులు పెడుతోందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. గురువారం నాడు ఆయన హైటెక్ సిటీలో ఎయిడెన్ ఏఐ (ూఱఅవవఅ ాూ×) ఇంజనీరింగ్ కేంద్రం విస్తరణ పనులను ప్రారంభించిన సందర్భంగా ప్రసంగించారు. రెండేళ్లలో తమ ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఎకో సిస్టం వల్ల ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఇవ్వాళ తెలంగాణా వైపు చూస్తున్నాయని ఆయన తెలిపారు. ఎయిడెన్ ఏఐలో ప్రస్తుతం 500 మంది నిపుణులు పనిచేస్తుండగా వచ్చే రెండేళ్లలో మరో 500 మంది ప్రతిభావంతులకు ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. న్యూజెర్సీలోని ప్రిన్స్ టన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ కృత్రిమ మేథలో నూతన ఆవిష్కరణల ద్వారా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని తెలిపారు. ఏఐని విస్తృత కార్యకలాపాలకు అభివృద్ధి చేసే సంస్థలను తమ ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుందని శ్రీధర్ బాబు వివరించారు. కార్యక్రమంలో సంస్థ సిఇఒ కిరణ్ వెంట్రప్రగడ, సిఒఒ శ్రీని కమిడి, కవితా మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన జిల్లా ఎన్నికల అధికారి

హైదరాబాద్, 08 జనవరి , కరపత్రం ప్రతినిది

హైదరాబాద్ చుడీబజార్‌లోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎం) నిల్వ చేసే గోదాంను గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ తనిఖీ చేశారుఈ సందర్భంగా ఈవీఎంల భద్రత కోసం అమలులో ఉన్న కట్టుదిట్టమైన భద్రతా చర్యలు, 24 గంటల నిఘా వ్యవస్థ, సరైన వెంటిలేషన్ ఏర్పాట్లు, అలాగే ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పాటిస్తున్న నిబంధనలను సమీక్షంచారు.అదేవిధంగా అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు మరియు నిరంతర విద్యుత్ సరఫరా, పవర్ బ్యాకప్ వ్యవస్థలను పరిశీలించారు.

## రాజ్ కోట్ మున్సిపల్ కార్పొరేషన్ నీ సందర్శించిన జీహెచ్ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్,కార్పొరేటర్లు

- ⊙ఉ అధికారులతో మేయర్, డిప్యూటీ మేయర్,కార్పొరేటర్ల భేటీ, క్షత్ర స్థాయిలో అధ్యయనం.
- ⊙ఉ రాజ్ కోట్ నగరంలో బెస్ట్ ప్రాక్టీసెస్ పై అధ్యయనం.
- ⊙ఉ ఫ్లెక్సీ లు లేని నగరంగా రాజ్ కోట్
- ⊙ఉమొక్కలకు ట్రీ గార్డ్ లు ఏర్పాటు, గృహ చెత్త సేకరణ రుసుం ప్రాపర్టీ టాక్స్ లోనే చేర్చి వసూలు చేయడం వంటి ఉత్తమ విధానాల గుర్తింపు.

హైదరాబాద్, 08 జనవరి కరపత్రం ప్రతినిది

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి , కార్పొరేటర్లు

స్టడీ టూర్ లో భాగంగా నిన్న, ఈ రోజు (గురువారం) ఉదయం గుజరాత్ రాష్ట్రం సౌరాష్ట్ర రీజియన్ లోని రాజ్ కోట్ మున్సిపల్ కార్పొరేషన్ నీ సందర్శించారు.ఈ సందర్భంగా రాజ్ కోట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తమ మున్సిపాలిటీ పాలనా పనితీరు , అమలులో ఉన్న ఉత్తమ విధానాలను, పారిశుద్ధ్యం , ఘన వ్యర్థాల నిర్వహణ,పౌర సేవలు, ఈ ఉ గవర్నెన్స్, మొక్కల సంరక్షణ,పర్యావరణ పరిరక్షణ,అభివృద్ధి ప్రణాళికలను నగర కార్పొరేటర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జీహెచ్ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేటర్లకు వివరించారు.అనంతరం రాజ్ కోట్ నగరంలో కార్పొరేటర్లు క్షత్రస్థాయి లో పర్యటించారు. ఉత్తమ విధానాలను పరిశీలించారు.నగరంలో ఎక్కడా ఫ్లెక్సీ లు గానీ , ఫ్లెక్సీ తో కూడిన హోర్డింగ్ కనిపించలేదు. అన్నిమొక్కల కు ట్రీ గార్డ్ ను ఏర్పాటు చేశారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా నగరంలోని అన్నివిద్యుత్ ట్రాన్స్ఫార్మర్లకు గ్రిల్ లను ఏర్పాటు చేశారు.జీహెచ్ఎంసీ లో స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించినందుకు యజమాని నుండి నెలకు రూ.100 వసూలు చేస్తుండగా రాజ్ కోట్ నగరంలో ప్రాపర్టీ టాక్స్ వసూలు లోనే చెత్త సేకరణ రుసుం ను చేర్చారు. సంవత్సరానికి రెసిడెన్షియల్ ఒక్కంటికి రూ.350, కమర్షియల్ అయితే రూ. 730 వసూలు చేస్తున్నారు.రాజ్ కోట్ స్టడీ టూర్ లో భాగంగా వీటినీ బెస్ట్ ప్రాక్టీసెస్ గా కార్పొరేటర్లు గుర్తించారు. ఈ అంశాల పై కార్పొరేటర్లుసమగ్ర అధ్యయనం చేశారు. ఈ బెస్ట్ ప్రాక్టీసెస్ ను గ్రేటర్ హైదరాబాద్ నగరంలో అమలు చేసేందుకు తద్వారాప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయనున్నారు.ఇవి కాకుండా పారిశుద్ధ్యం , కార్మికుల ఫేషియల్ అటెండెన్స్ సహా మిగతా అంశాల్లో జీహెచ్ఎంసీ అనుసరిస్తున్న విధానాలే బాగున్నాయని కార్పొరేటర్ల క్షత్ర అధ్యయనంలో తేలింది.రాజ్ కోట్ లో పర్యటన ముగిసిన వెంటనేఅహ్మదాబాద్ నగరం కు కార్పొరేట్లు చేరుకుంటారు. ఈ రోజు సాయంత్రం, రేపు అహ్మదాబాద్ నగరంలో బెస్ట్ ప్రాక్టీసెస్ పై క్షత్ర అధ్యయనం చేస్తారు.కార్పొరేటర్లు తమ స్టడీ టూర్ పూర్తి అయ్యాక బెస్ట్ ప్రాక్టీసెస్ పై రూపొందించిన రిపోర్ట్ ను జీహెచ్ఎంసీకి సమర్పిస్తారు.

## పలువురు డీసీపీల బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్ జనవరి 8 కరపత్రం ప్రతినిది



పునర్వ్యవస్థీకరించిన హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ జోన్లకు నూతనంగా నియమితులైన పలువురు డీసీపీలు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వీరంతా నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి పుష్పగుచ్చాలు అందజేశారు.

బాధ్యతలు స్వీకరించిన వారు..

చార్మినార్ జోన్: .కారే కిరణ్ ప్రభాకర్, ఐపీఎస్
రాజేంద్రనగర్ జోన్ : ఎస్.శ్రీనివాస్ ఐపిఎస్
గోల్కొండ జోన్: జి. చంద్రమోహన్
జూబ్లీహిల్స్ జోన్: ఏ. రమణారెడ్డి
శంషాబాద్ జోన్: , బి. రాజేష్

నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులను కమిషనర్ సాదరంగా ఆహ్వానించారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా సమర్థంగా పనిచేయాలని అధికారులకు ఈ సందర్భంగా సీపీ దిశానిర్దేశం చేశారు.

## చైనీస్ మాంజాపై హైదరాబాద్ పోలీసుల కొరడా - రూ. 1.24 కోట్ల విలువైన నిషేధిత మాంజా స్వాధీనం





హైదరాబాద్ జనవరి 8 కరపత్రం

సంక్రాంతి పండుగ వేళ పర్యావరణానికి, పక్షలకు హాని కలిగించే నిషేధిత చైనీస్ మాంజా (నైలాన్/సింథటిక్ దారం) విక్రయాలను అరికట్టేందుకు హైదరాబాద్ నగర పోలీసులు విస్తృత చర్యలు చేపట్టారు. నగర కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో పెద్ద ఎత్తున నిషేధిత మాంజాను స్వాధీనం చేసుకున్నారు.

చైనా మాంజాపై గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ఐపీఎస్ మాట్లాడుతూ.. “సంక్రాంతి అంటేనే పతంగుల పండుగ, ఆనందాల హేళ. అయితే, మన సంతోషం మరొకరి ప్రాణానికి ముప్పుగా పరిణమించకూడదు. పర్యావరణానికి, మనుషుల ప్రాణాలకు హాని కలిగించే ‘చైనీస్ మాంజా’పై ప్రభుత్వం సంపూర్ణ నిషేధం విధించింది. నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ కొందరు గుట్టుచప్పుడు కాకుండా వీటిని విక్రయిస్తున్నారు. నగరంలో ఎవరైనా చైనా మాంజాను విక్రయించినా, గోదాముల్లో నిల్వ చేసినా, అక్రమ రవాణాకు పాల్పడినా ఉపేక్షంచే ప్రసక్తే లేదు. నిబంధనలు అతిక్రమిస్తే తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తాం,” అని హెచ్చరించారు.

దుకాణాల్లో తనిఖీలు ముమ్మరం చేయడంతో వ్యాపారులు ఆన్‌లైన్ బాట పట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ-కామర్స్ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా వేదికగా సాగే క్రయవిక్రయాలపై 24 గంటల పాటు ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. ఆన్‌లైన్‌లో మాంజా కొనుగోలు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్లాస్టిక్, గాజు పెంకులు, మెటాలిక్ కోటింగ్ ఉండే ఈ మాంజా వల్ల పిల్లలకు విద్యుత్ షాక్ కొట్టే ప్రమాదం ఉందని, తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి సంప్రదాయ నూలు దారాలనే ప్రోత్సహించాలని కోరారు. ఎవరైనా మాంజా విక్రయిస్తే ‘డయల్ 100’ లేదా వాట్సాప్ నెంబర్ 94906 16555 కి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

కేసులు మరియు స్వాధీనం వివరాలు:

నగరవ్యాప్తంగా అన్ని జోన్లలో నిర్వహించిన దాడులలో ఇప్పటివరకు మొత్తం 103 కేసులు నమోదు కాగా, 143 మంది నిందితులను అరెస్టు చేయడం జరిగింది. వీరి నుంచి రూ. 1,24,52,000 (ఒక కోటి ఇరవై నాలుగు లక్షల యాభై రెండు వేలు) విలువైన 6,226 మాంజా బాబిన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

జోన్ల వారీగా గణాంకాలను పరిశీలిస్తే.. సౌత్ వెస్ట్ జోన్ లో అత్యధికంగా 34 కేసులు నమోదు కాగా, 46 మందిని అరెస్టు చేసి, రూ. 65,30,000 విలువైన 3,265 బాబిన్లను సీజ్ చేశారు. ఆ తర్వాతి స్థానంలో సౌత్ జోన్ లో 27 కేసులు నమోదు కాగా, 35 మందిని అరెస్టు చేసి రూ. 37,22,000 విలువైన 1,861 బాబిన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ జోన్ లో 18 కేసులు (29 అరెస్టులు, రూ. 6.02 లక్షల విలువైన 301 బాబిన్లు), సౌత్ ఈస్ట్ జోన్ లో 09 కేసులు (10 అరెస్టులు, రూ. 4.42 లక్షల విలువైన 221 బాబిన్లు) నమోదయ్యాయి. ఇక సెంట్రల్ జోన్ లో 06 కేసులు, నార్త్ జోన్ లో 05 కేసులు, వెస్ట్ జోన్ లో 04 కేసులు నమోదయ్యాయి.

ముఖ్యంగా, ఈ దాడులలో హైదరాబాద్ సిటీ టాస్క్ ఫోర్స్ కీలక పాత్ర పోషించింది. మొత్తం నమోదైన కేసుల్లో 67 కేసులు టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలోనే నమోదు కాగా, 87 మందిని అదుపులోకి తీసుకొని రూ. 68.78 లక్షల విలువైన సరుకును సీజ్ చేశారు.

“ఈ కార్యక్రమంలో అడిషనల్ సిపి (క్రైమ్స్ ఑ సిట్) ఎం. శ్రీనివాసులు, ఐపిఎస్, డిసిపిలు కారె కిరణ్ ప్రభాకర్, ఐపిఎస్, జి. చంద్రమోహన్, ఐపిఎస్, గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఐపిఎస్, అడిషనల్ డిసిపి (టాస్క్ ఫోర్స్) అందె శ్రీనివాస్ రావు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ అధికారులను, వారి బృంద సభ్యులను మరియు సిబ్బందిని అభినందించి, నగదు బహుమతులను అందజేశారు.”

## తారకరామారావు ను కలిసిన గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా

శేరిలింగంపల్లి జనవరి 8 కరపత్రం ప్రతినిది



తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు , బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్,సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారకరామారావు గారిని నంది నగర్ లోని ఆయన నివాసం లో బోవెన్ పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ మరియు గచ్చిబౌలి డివిజన్ ముఖ్య నాయకులతో కలిసి. గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు మరియు గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా